అక్షర టైమ్స్
www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా /శ్రీ సత్యసాయి జిల్లా

# తుంగభద్రలో తీవ్ర నీటి కొరత ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



**రాయదుర్గం, జూలై 04. అక్షర టైమ్స్:-** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తుంగభద్ర ప్రాజెక్టులో తీవ్ర నీటి కొరత నెలకొన్నందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఖరీఫ్‌లో తుంగభద్ర ఆయకట్టు పరిధిలో సాగునీరు అందించడం అత్యంత క్లిష్టంగా మారిందని రాయదుర్గంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వలు అత్యంత ఆందోళనకర స్థాయిలో 9.80టీఎంసీలు ఉన్నాయన్నారు. గత 60 ఏళ్లలో ఇంత తీవ్రమైన నీటి కొరత పరిస్థితిని ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. గత ఏడాది ఇదే సమయానికి సుమారు 73 టీఎంసీలు ఉండేవని, గత 60 ఏళ్ల సగటు తీసుకుంటే కనీసం 28 టీఎంసీలు డ్యామ్ లో చేరాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం జలాశయంలో సుమారు 9.8 టీఎంసీల మేరకే నీటి నిల్వలు ఉన్నాయని, అందులోనూ వినియోగానికి అందుబాటులో కొత్తగా వర్షాలకు వచ్చిన నీటి పరిమాణం చాలా తక్కువగా ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే ఈ ఖరీఫ్ సీజన్‌లో తుంగభద్ర ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయడం సాధ్యపడే పరిస్థితి కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయకట్టు పరిధిలో సాగునీరు ఇవ్వడం వీలు కాదని కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని గుర్తు చేశారు. ఇంజనీరింగ్ నిపుణులు సైతం ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏడాది అంచనాలకు అనుగుణంగా నీరు రావడంలేదని, పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉన్నాయని స్పష్టం చేశారన్నారు. త్వరలో తుంగభద్ర పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి అధికారికంగా తెలియజేస్తామన్నారు. రైతులు ఈపాటికే నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారని వివరించారు. ఎల్ ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం ఎదురవుతున్న నీటి సమస్యను రైతులు అర్థం చేసుకుని తదనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని ముందుగా తాగునీటి అవసరాలకు వినియోగించాలని తుంగభద్ర బోర్డు ఇప్పటికే నిర్ణయం తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో నీటిని అత్యంత పొదుపుగా వినియోగిస్తూ ప్రజల తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆయకట్టు రైతాంగం ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జిలు పోరాళ్ల పురుషోత్తం, ఇనాయత్, మాజీ కౌన్సిలర్లు కడ్డీపుడి మహబూబ్ బాషా, బండి భారతి, కురుబ ప్రశాంతి, బుదురు తిప్పేస్వమి, డబ్బిడి శివ,ఆనంద్,కొండాపురం శ్రీనివాసులు, కరెన్న తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ ఇక కరవు ప్రాంతం కాదు ఇండస్ట్రియల్ హబ్

## రాయలసీమ ఉక్కు పరిశ్రమ ప్రారంభంపై పరిటాల సునీత హర్షం

## గంగంపల్లి గ్రామస్థులకు ఇళ్ల పట్టాల పంపిణీ

## ఆర్డీటీ సహకారంతో ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సునీత చొరవ

## మూడోవంతు పరిశ్రమలు సీమకే వస్తున్నాయన్న ఎమ్మెల్యే సునీత



**అనంతపురం,జూలై04.అక్షర టైమ్స్:-** రాయలసీమ అన్నది ఇక కరవు ప్రాంతం కాదని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పారిశ్రామిక హబ్ గా మారుతోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం నసనకోట పంచాయతీలోని గంగంపల్లి గ్రామస్థులకు ఆమె ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వెంకటాపురంలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గంగంపల్లి గ్రామస్థులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. మొత్తం 40మంది బిసి, మైనారిటీ కుటుంబాల వారికి ఒక్కొక్కరికి 3సెంట్ల ప్రకారం ఇంటి స్థలాల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో చాలా చోట్ల స్థలాల సేకరణ జరిగిందన్నారు. అయితే ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో అవన్నీ నిలిచిపోయాయన్నారు. ఐదేళ్లలో కబుర్లు చెప్పారు తప్ప.. ఎక్కడ ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చింది కానీ, ఇళ్లు నిర్మించింది కానీ లేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. చాలా చోట్ల ఈ ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టినట్టు తెలిపారు. ప్రస్తుతం గంగంపల్లి గ్రామంలో 40కుటుంబాల వారికి పట్టాలు ఇచ్చామన్నారు. అలాగే సుమారు 4లక్షల రూపాయల వ్యయంతో ఆర్డిటి సంస్థ వారు నూతన గృహాలను నిర్మించేందుకు ముందుకొచ్చారన్నారు. వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ కొందరు గృహాలు నిర్మించుకోలేదన్నారు. అలాంటి వారికి పట్టాలు రద్దయ్యే అవకాశం ఉందని.. వారు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు...

**రాయలసీమ రూపురేఖలు మారుతున్నాయి**

అత్యంత వెనుకబడిన రాయలసీమ రూపురేఖలు మార్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మించనున్న రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించడంపై ఆమె తన ఆనందాన్ని పంచుకున్నారు. రాయలసీమలో పంటలు సరిగా పండక, బీడు భూములు కనిపించేవన్నారు. హంద్రీనీవా రాకతో కొంత వరకు పరిస్థితులు మారాయన్నారు. కానీ కొన్ని ప్రాంతాల్లో ఇంకా కరవు ఛాయలు ఉన్నాయన్నారు. ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా చొరవ తీసుకుని రాయలసీమలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమల్లో మూడోవంతు రాయలసీమ ప్రాంతాలకే తరలి వస్తున్నాయంటే సీమపై ముఖ్యమంత్రికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. రెండేళ్లలో రాయలసీమకు రూ.4.58 లక్షల కోట్ల పెట్టుబడులు 2.76 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టారన్నారు. రాయలసీమ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష ఉక్కు పరిశ్రమకు జే.ఎస్.డబ్ల్యూ సంస్థ పూర్తి గ్రీన్ ఎనర్జీతో మొదటి దశలోనే రూ.4500 కోట్ల పెట్టుబడితో నిర్మాణం జరుపుతోందని.. 2028 నాటికి పూర్తై రాయలసీమ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ముందుకు వెళ్తుందన్నారు. ఐదేళ్లలో రెండుసార్లు కడప ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేసిన జగన్.. కనీసం ప్రహరీ గోడ కూడా నిర్మించకుండా.. నేడు అంతా తన గొప్పేనని చెప్పుకుంటున్నారన్నారు. కేవలం పరిశ్రమలకే కాకుండా వ్యవసాయానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా మారుస్తున్నారన్నారు. డ్రిప్ ఇరిగేషన్లో రాయలసీమను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. అలాగే సాగునీటి ప్రాజెక్టులను కూడా వేగవంతం చేశారన్నారు. ఈ ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# ద్విచక్ర వాహనాల వరుస చోరీలు

## పోలీసుల పనితీరుపై స్థానికుల విమర్శలు



**అనంతపురం,జులై04.అక్షర టైమ్స్:-** నగరంలో ద్విచక్ర వాహనాల చోరీలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. నివాస ప్రాంతాలు, వ్యాపార సముదాయాల పరిధిలో పార్క్ చేసిన బైక్‌లు కూడా మాయమవుతుండటంతో వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ముఖ్యంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దొంగతనాలు మరీ ఎక్కువగా జరుగుతుండటం, పోలీసులు వీటిని అరికట్టడంలో విఫలమవ్వడంపై స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన కొన్ని వారాలుగా వన్‌టౌన్ పరిధిలోని బుడ్డప్ప నగర్ పరిసర ప్రాంతాల్లో రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి. కష్టపడి కొనుక్కున్న వాహనాలు కళ్లముందే మాయమవుతుంటే, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని బాధితులు వాపోతున్నారు. వన్ టౌన్ పరిధిలో రాత్రి వేళల్లో పహారా సరిగా లేకపోవడమే ఈ దొంగతనాలకు ప్రధాన కారణమని ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా కాలనీలు, అపార్ట్‌మెంట్ ప్రాంతాలు, షాపింగ్ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని బైక్ దొంగలు చెలరేగిపోతున్నారని, పోలీసుల నిఘా వ్యవస్థ ఏమైంది..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే బైక్ చోరీలకు గురైన బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినప్పటికీ ఇప్పటివరకు సరైన పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు అప్రమత్తమై రాత్రి పహారా పెంచి, సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకుని ప్రజల్లో భరోసా కల్పించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# నూతన ఎస్సైగా విజయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



**తాడిపత్రి/రూరల్,జూలై04.అక్షర టైమ్స్:-** తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా విజయ్ కుమార్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై తాడిపత్రికి వచ్చారు. గతంలో ఎస్సైగా శ్రీ సత్యసాయి జిల్లాలోని పెనుగొండ, సోమందేపల్లి ప్రాంతాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి గుర్తింపు పొందారు. అయితే ఇక్కడ తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఎస్సై ధరణి బాబు బదిలీపై అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.

# దుర్గంలో పిచ్చికుక్క బీభత్సం..



**రాయదుర్గం,జూలై04.అక్షర టైమ్స్:-** రాయదుర్గం పట్టణంలో శనివారం నాడు ఒక్క కుక్క దాడిలో దాదాపుగా 40 మందికిపైగా గాయాలు కాక చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా దాడులు చేసి ప్రజలకు భయభ్రాంతులను సృష్టించింది . కుక్క దాడిలో గాయపడ్డ వారంతా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. దీనికంతటికి మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని గతంలో అనేకసార్లు కౌన్సిలర్ల సమావేశంలో కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని ప త్రికలలోవార్తలు కూడా ప్రచురించడం జరిగింద నీ స్థానికుల ఆరోపణ చేశారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించిపట్టణంలో వీధికుక్కల బెడద నివారించాలని బాధితుల డిమాండ్ వేశారు.

# ఓటర్ ఫామ్ తనిఖీలకు విజయనగర్ కాలనీకి కలెక్టర్ ఓ ఆనంద్ సందర్శన





**బుక్కరాయసముద్రం,జులై04.అక్షర టైమ్స్:-** బుక్కరాయసముద్రం మండలం విజయనగర్ కాలనీలో జిల్లా కలెక్టర్ మరియు ట్రైనింగ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వారితో పాటు కలెక్టర్ ఆఫీస్ సిబ్బంది, బుక్కరాయసముద్రం ఎమ్మార్వో శ్రీధర్ మూర్తి ,ఆర్ఐ వీఆర్వోలు బి ఎల్ ఓ లు మరియు బి ఎల్ ఎ లు పాల్గొన్నారు. ఈ సందర్శన సందర్భంగా ఫామ్ ఓటర్ నమోదు ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. బి ఎల్ ఓ లు మరియు బిఎల్ఏ లు ఇంటింటికీ వెళ్లి చేస్తున్న పనితీరును అడిగి తెలుసుకున్నారు. పార్టీ ప్రతినిధులు రాఘవ మరియు రాజారెడ్డి తనిఖీల్లో పాల్గొన్నారు. కాలనీ ప్రజలు పాల్గొన్నవారు పద్మావతి పూజారి చంద్రశేఖర్ , మంగళ నాగమ్మ వెంకట లక్ష్మమ్మ దుగ్గదేకుల భాను , ఉరుముల రాము మరియు విజయనగర్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఓటర్ నమోదులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరూ సహకరించాలని కలెక్టర్ సూచించారు.

# విజయవాడకు బయలుదేరిన ఏబిఏపి జిల్లా కమిటీ సభ్యులు



**అనంతపురం,జూలై04.అక్షర టైమ్స్:-** అఖిల భారత అయ్యప్ప స్వామి ధర్మ ప్రచార సభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం ఆదివారం విజయవాడ నగరంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరగనుంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు అనంతపురం జిల్లా అఖిల భారత అయ్యప్ప స్వామి ధర్మ ప్రచార సభ కమిటీ సభ్యులు శనివారం విజయవాడకు బయలుదేరారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి కమిటీ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాల విస్తరణ, ధర్మ ప్రచారం, భక్తులకు అందిస్తున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణ, సంఘం బలోపేతంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత అయ్యప్ప స్వామి ధర్మ ప్రచార సభ జాతీయ అధ్యక్షులు అయ్యప్పదాసు ముఖ్య అతిథిగా హాజరై సభ్యులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అలాగే రాష్ట్రంలోని పలు జిల్లాల బాధ్యులు, కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. ఈ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం ద్వారా సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించి, అయ్యప్ప స్వామి ధర్మ ప్రచారాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లే దిశగా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని కమిటీ సభ్యులు తెలిపారు.

# వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లలో చోరీ

**ఉరవకొండ,జులై04.అక్షర టైమ్స్:-** గ్రామాలలో దొంగలు రెచ్చిపోతుండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఒకవైపు కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రకృతి వైపరీత్యాలు, పెట్టుబడి భారాలు ఇబ్బందులు కలిగిస్తుండగా, మరోవైపు వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, విద్యుత్ వైర్లు వరుసగా చోరీకి గురవుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. తాజాగా పెన్నాహోబిలం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిలోని విలువైన రాగి కాయిల్స్‌ను అపహరించారు. ఈ ఘటనతో రైతులకు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో సాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయి, పంటలకు నీరు అందించలేని పరిస్థితి నెలకొంది. శుక్రవారం అర్ధరాత్రి అమిద్యాల గ్రామానికి చెందిన రైతులు శివ రామకృష్ణ, రగురాములు, అదేప్ప, సురేష్ ఆచారి, ఆదినారాయణ, ఎర్రిస్వామిలకు చెందిన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మండలంలో గత కొంతకాలంగా వ్యవసాయ మోటార్లు, విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వరుసగా చోరీకి గురవుతున్నప్పటికీ, దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారని రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ లేకపోవడంతో దొంగలు నిర్భయంగా సంచరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రైతులకు ఇలాంటి చోరీలు తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పునరుద్ధరించడానికి రోజులు పట్టడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దొంగల ముఠాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, వ్యవసాయ ప్రాంతాల్లో రాత్రి పూట ప్రత్యేక పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# రాయితీపై రైతులకు కంది విత్తనాలు పంపిణీ





**యాడికి,జులై04.అక్షర టైమ్స్:-** మండలంలోని రాయల చెరువు గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో ఆత్మ నిర్భారత పథకం కింద రాయితీ పై రైతులకు కంది విత్తనాలు ఏవో మహబూబ్ బాషా, టిడిపి నాయకులు మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మహబూబ్ బాషా మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం కారణంగా రైతులకు స్వల్ప కాలిక పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని రైతులు ఈ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి పవన్ కుమార్, పంచాయతీ సెక్రెటరీ అరుణ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# బుక్కరాయసముద్ర మండల అనంత క్రీడా ఛాంపియన్షిప్ తేదీలు ఫిక్స్





**జూలై 7, 8 తేదీలలో**

**జెడ్పిహెచ్ఎస్ లో పోటీలు**

**బుక్కరాయసముద్రం,జూలై04.అక్షర టైమ్స్:-** బుక్కరాయసముద్రం మండలంలో జరిగిన సమావేశంలో అనంత క్రీడా ఛాంపియన్షిప్ తేదీలను అధికారులు ప్రకటించారు. పోటీల వివరాలు తేదీ: జూలై 7 మరియు 8, 2026, వేదిక బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూలై 7 కబడ్డీ, కో-కో, వాలీబాల్ - యు 14 విభాగం పోటీలు జూలై 8 అథ్లెటిక్స్ పోటీలు బుక్కరాయసముద్రం మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులందరూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. సమావేశంలో పాల్గొన్నవారు ఎంపీపీ సునీత, ఎంపీడీవో సల్మాన్ ఎంఈఓ -1 నవీద్, ఎంఈఓ -2 లింగ నాయక్, జడ్.పి.హెచ్.ఎస్ హెచ్ఎం వసుంధర, మండల్ కోఆర్డినేటర్ నాగరాజు, పీడీ రాజశేఖర్ రెడ్డి, వెంకటరమణ, వరలక్ష్మి, లలిత, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటాలని అధికారులు కోరారు.

# పాము కాటుకు గురై మృతి చెందిన మహిళా కూలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్



**రాయదుర్గం,జూలై04.అక్షర టైమ్స్:-** అనంతపురం జిల్లాలోని రాయదుర్గం పట్టణ సమీపంలో నీ మల్లాపురం గ్రామానికి చెందిన మహిళా చిట్టెమ్మ పాము కాటుకు గురై మృతి చెందడం బాధాకరం. నిరుపేద కుటుంబానికి చెందిన ఈ మహిళ మృతి వారి కుటుంబానికి తీరని లోటు. అని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ బి వెంకటరమణ అన్నారు. మల్లాపురం గ్రామంలో మృతి చెందిన మహిళా ఇంటికి ఆయన సందర్శించి భర్త శ్రీనివాసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించే ఏకైక ఆధారాన్ని ఆ మహిళ కోల్పోయింది. మృతురాలి కుటుంబం అత్యంత దుర్భర పరిస్థితుల్లో ఉంది. కావున, జిల్లా అధికారులు మరియు జిల్లా పాలనా యంత్రాంగం వెంటనే స్పందించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తక్షణ ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. మౌలిక వసతులు పాము కాటుకు గురైన ప్రాంతం , అక్కడ సరైన పారిశుధ్యం లేకపోవడం, వీధి దీపాలు సరిగ్గా వెలగకపోవడం వంటి సమస్యలను కలుపు మొక్కలు, ముళ్ల పొదలు తొలగించేలా గ్రామ పంచాయతీ అధికారులను చొరవ చూపాలని అధికారులను సూచించారు. అధికారులకు స్పష్టమైన ఆదేశాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామంలో చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలపై స్థానిక అధికారులకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కమిటీ తరపున నివేదిక క్షేత్రస్థాయిలో జరిగిన ఈ నష్టంపై పూర్తి వివరాలు సేకరించి, జిల్లా కలెక్టర్ కి నివేదిక అందజేస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ యాక్ట్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు అబ్దుల్లా శంకరప్ప కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వం అండగా కొడవండ్లపల్లిలో కందుల విత్తనాల పంపిణీ

**మంత్రి సత్య కుమార్ యాదవ్**

**ఆదేశాల మేరకు కార్యక్రమం**

**రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**

**కొడవండ్లపల్లి గ్రామంలో రైతులకు కందుల విత్తనాలు పంపిణీ చేస్తున్న ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు వై. చంద్రమోహన్ మండల ఓబీసీ మోర్చా కార్యదర్శి రేకె ప్రభాకర్, మండల జనసేన ఉపాధ్యక్షులు నరేంద్ర, బీజేవైఎం ఉపాధ్యక్షులు కనుమ నరేంద్ర, కూటమి నాయకులు, అధికారులు**



**ముదిగుబ్బ,జూలై04.అక్షర టైమ్స్:-** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమనే ఉద్దేశంతో రాష్ట్ర వైద్య విద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు, ముదిగుబ్బ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు జి. ఆదినారాయణ యాదవ్ సహకారంతో, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు వై. చంద్రమోహన్ ఆధ్వర్యంలో కొడవండ్లపల్లి గ్రామంలో రైతులకు కందుల విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం ద్వారా దిగుబడులు పెంచి వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఓబీసీ మోర్చా కార్యదర్శి రేకె ప్రభాకర్, మండల జనసేన ఉపాధ్యక్షులు నరేంద్ర, బీజేవైఎం ఉపాధ్యక్షులు కనుమ నరేంద్ర, స్కూల్ చైర్మన్ లింగమయ్య, వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, బీజేపీ నాయకులు, కూటమి నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# బుక్కరాయసముద్రంలో విస్తృత వాహన తనిఖీలు

**హెల్మెట్,సీట్ బెల్ట్ తప్పనిసరి**



**బుక్కరాయసముద్రం,జూన్04.అక్షర టైమ్స్:-** అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్,ఐపీఎస్ ఆదేశాల మేరకు బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో పోలీసు అధికారులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. బుక్కరాయసముద్రం సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎస్సై గోవిందు, ఏఎస్ఐ రాము మరియు సిబ్బంది కలిసి ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ.,రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీసు వారికి సహకరించి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు



**పెద్దవడుగూరు,జులై04.అక్షర టైమ్స్:-** మండల కేంద్రమైన పెద్దవడుగూరు ఎంపీడీవో కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు,అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బారెన్ సాహెబ్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో అల్లూరి సీతారామరాజు చిరస్థాయిగా నిలిచిపోయిన మహానాయకుడని కొనియాడారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన మహావీరుడిగా ఆయన చరిత్రలో చిరస్మరణీయుడిగా నిలిచారని అన్నారు. యువత అల్లూరి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి ఈఓఆర్డి శ్రీదేవి సూపర్డెంట్ నాగభూషణ పలు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఓటర్ ఫామ్ తనిఖీలకు విజయనగర్ కాలనీకి కలెక్టర్ సందర్శన



**బుక్కరాయసముద్రం,జులై04.అక్షర టైమ్స్:-** బుక్కరాయసముద్రం మండలం విజయనగర్ కాలనీలో జిల్లా కలెక్టర్ మరియు ట్రైనింగ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వారితో పాటు కలెక్టర్ ఆఫీస్ సిబ్బంది, బుక్కరాయసముద్రం ఎమ్మార్వో శ్రీధర్ మూర్తి ,ఆర్ఐ వీఆర్వోలు బి ఎల్ ఓ లు మరియు బి ఎల్ ఎ లు పాల్గొన్నారు. ఈ సందర్శన సందర్భంగా ఫామ్ ఓటర్ నమోదు ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. బి ఎల్ ఓ లు మరియు బిఎల్ఏ లు ఇంటింటికీ వెళ్లి చేస్తున్న పనితీరును అడిగి తెలుసుకున్నారు. పార్టీ ప్రతినిధులు రాఘవ మరియు రాజారెడ్డి తనిఖీల్లో పాల్గొన్నారు. కాలనీ ప్రజలు పాల్గొన్నవారు పద్మావతి పూజారి చంద్రశేఖర్ , మంగళ నాగమ్మ వెంకట లక్ష్మమ్మ దుగ్గదేకుల భాను , ఉరుముల రాము మరియు విజయనగర్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఓటర్ నమోదులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరూ సహకరించాలని కలెక్టర్ సూచించారు.

# నూతన ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న ప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు




**శింగనమల,జులై04.అక్షర టైమ్స్:-** శింగనమల నూతన ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న సురేష్ నీ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కలవడం జరిగింది. నాయకులు మాట్లాడుతూ గ్రామలలో దళితులపైన ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగిన పేద ప్రజలకు తోడు నీడ ఉండాలని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కీ విన్నవించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కుమ్మలమల రామాంజనేయులు జిల్లా తప్పెట కళాకారుడు అధ్యక్షుడు నాగరాజు ఎమ్మె ఎస్పీ సింగనమల నియోజకవర్గ కన్వీనర్ సి జలాలపురం ఓబులేసు ఎంఎస్పి నల్లప్ప మరియు రామ్మోహన్ డాక్టర్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కురుగుంట ఓబులేసు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# దశరథ రామయ్య కుటుంబానికి రూ లక్ష ఆర్థిక సహాయం




**గాండ్లపెంట,జూన్04.అక్షర టైమ్స్:-** గాండ్లపెంట మండలం ద్వారనాలకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు నల్ల సానీ దశరథ రామయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబానికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రూ లక్ష ఆర్థిక సహాయం అందించారు ఈ మొత్తాన్ని ఆయన కుమార్తె నలసాని చరితకు టిడిపి నాయకులు చేతుల మీదుగా అందజేశారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకట ప్రసాద్ నల్లచెరువు మండల కన్వీనర్ రాజశేఖర్ చిన్నోడు నాగరాజు ఊరది చంద్ర అంజనప్ప భాస్కర్ గంగులప్ప పాల్గొన్నారు

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన వడ్డెర సంఘం నాయకులు



**ఆమడగూరు,జులై04.అక్షర టైమ్స్:-** అమడగూరు మండలం పరిధిలోని సానేవారిపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వాన్ని కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాన్ని వడ్డెర సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి పరిస్థితిని తెలుసుకున్న అనంతరం తమ వంతు సహాయంగా నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని వడ్డెర సంఘం నాయకులు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి తగిన నష్టపరిహారం, గృహ సౌకర్యం, నిత్యావసర వస్తువులు అందించి ఆదుకోవాలని వారు కోరారు. వడ్డెర సంఘం నాయకులు అందించిన ఆర్థిక సహాయంపై బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వారి సేవా కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు. మండల వడ్డెర్ల సంఘం నాయకుడు దొనకొండ రమణప్ప,గౌరవ సలహాదారులు నాగరాజు,బిసి సెల్ ప్రధాన కార్యదర్శి రమణ,మాజీ ఎంపీపీ రామచంద్ర, సంజీవ్, రవి, అంజి, నాగార్జున, వడ్డెర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పామిడిలో నేడు రాష్ట్రమంత్రిచే బిజెపి జండా ఆవిష్కరణ



**పామిడి,జూలై04.అక్షర టైమ్స్:-** మండల కేంద్రమైన పామిడి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన భారతీయ జనతా పార్టీ జండా ఆదివారం 10 గంటలకు రాష్ట్ర వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతులమీదుగా ఆవిష్కరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు మండల బిజెపి అధ్యక్షులు అంజి నాయక్ కార్యదర్శి కుమారస్వామి పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు గురుపూజోత్సవం సందర్భంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన జెండా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు భారతీయ జనతా పార్టీ జండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని, మండలంలోని బిజెపి,టిడిపి,జనసేనపార్టీ, ఆర్ఎస్ఎస్ లకు చెందిన కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రేణులు ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా వారు కోరారు.

# విద్యుత్ స్తంభానికి ఢీకొని వ్యక్తి మృతి



**ధర్మవరం,జులై04.అక్షర టైమ్స్:-** పట్టణంలోని కొనుటూరు బ్రిడ్జి వద్ద ధర్మవరం పట్టణం కొత్తపేటకు చెందిన లక్ష్మీనారాయణ (25-30) అనే జెర్రీ యజమాని విద్యుత్ స్తంభానికి ఢీకొని మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు మామిళ్ళపల్లి నుండి ధర్మవరమునకు వచ్చు సమయంలో ముందువైపు ఉన్న స్పీడ్ బ్రేకర్ ను గమనించకపోవడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి అక్కడే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందాడు అని తెలిపారు. తదుపరి సంఘటన స్థలానికి రూరల్ పోలీసులు చేరుకొని, దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. తదుపరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# పొడరాళ్లపల్లిలో పంచాయతీ పైపులు పగిలి నీరు వృథా పట్టించుకోని అధికారులు




**ముదిగుబ్బ,జూలై04.అక్షర టైమ్స్:-** ముదిగుబ్బ మండలం పొడరాళ్లపల్లి గ్రామంలో పంచాయతీ తాగునీటి పైపులు పగిలిపోవడంతో రోజులుగా విలువైన తాగునీరు రోడ్డుపై వృథాగా పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపుల లీకేజీ కారణంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో నీరు నిల్వ ఉండి రహదారులు బురదమయంగా మారాయి. దీంతో నడిచే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నారులు, వృద్ధులు జారి పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులకు తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తాగునీరు వృథా కాకుండా వెంటనే పైపులను మరమ్మతు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# గిరిజనుల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు

**పరిపాలన అధికారి అబ్దుల్ నబీ**



**ధర్మవరం,జులై04.అక్షర టైమ్స్:-** గిరిజనుల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని పరిపాలన అధికారి అబ్దుల్ రబీ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. డిప్యూటీ ఎంపీడీవోలు వెంకటేశు, షాషావలి, పంచాయతీ కార్యదర్శి మురళి, తదితర కార్యాలయ సిబ్బంది చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అబ్దుల్ నబీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. వారు పోషించిన పాత్ర భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు.

# ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి



**పెద్దవడుగూరు, జులై 04. అక్షర టైమ్స్:-** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియనుపారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని తాడపత్రి నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి రమేష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దవడుగూరు మండలంలో జరుగుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్వోలు ఎన్యుమరేషన్ ఫారాలను ఇంటింటికీ పంపిణీ చేయాలని, ఓటర్లకు ఫారాలు నింపే విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా అవసరమైన పత్రాలతో బీఎల్వోలకు సహకరించి నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు ఆయన వెంట తాసిల్దార్ ఉషారాణి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# క్రిమి సంహారక మందులు దొరకక రైతుల ఇబ్బందులు, రైతులు బిక్షగాళ్లు కాదు

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లపల్లి వీరయ్య చౌదరి

**కళ్యాణదుర్గం,జూలై04.అక్షర టైమ్స్:-** రైతులకు వ్యవసాయం కోసం చేసిన అప్పుల బాధతో చావడానికైనా మందులు దొరుకుతాయి కానీ పంటలకు దొరకడం లేదు,రాష్ట్రవ్యాప్తంగా రైతులుది పరిస్థితి నానాటికి దిగజారుతోంది. సకాలంలో విత్తనాలు ఎరువులు క్రిమిసంహారక మందులు దొరకవు. ఒకవేళ దొరికినా అధిక ధరలు చెల్లించాల్సి వస్తుంది. విత్తనాలు ఎరువులు కల్తివి మార్కెట్లో రైతులను తబ్బిబ్బు చేస్తున్నాయి. అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రకృతి సహకరించకున్నా ఏదో కొత్త పండిస్తే అమ్మ పోతే అడవి దళారులు అయిన కాడికి రైతు శ్రమను దోచుకుని రైతుల గొంతు కోస్తున్నారు. ప్రభుత్వాలు ఏవి వచ్చినా రైతుకు ఒరిగింది ఏమీ లేదు. అదేమిటో వింత. ఉద్యోగ సంఘ నాయకులు వస్తే సజావుగా చర్చలు జరుపుతారు. సినిమా యాక్టర్లు వస్తే డైనింగ్ టేబుల్ చర్చలు కార్పొరేట్ దిగ్గజాలు వస్తే కారు దాకా వెళ్లి స్వాగతం పలుకుతారు నాయకులు. రైతులు చేసిన పాపం ఏమిటో తెలియదు. వారి గోడు వినే నాధుడే లేడు. దీనికంతకి కారణం రైతులలో ఐకమత్యం సమభావము లేకపోవడమే. ప్రతి రాజకీయ పార్టీకి ఒక రైతు సంఘం ఉంటుంది ఆ సంఘం నాయకుడు ఆ పార్టీ అధినేత ఏది చెప్తే అదే చిలకపలుకుగా చెప్తాడు. అతను రైతు నాయకుడు కాదు ఆ పార్టీకి రాజకీయ నాయకుడు నాకు ఒక విషయం ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తుంది ఈనాడు పార్లమెంటు లో కానీ అసెంబ్లీలో కానీ ఎగువ సభలో కానీ ఉన్న నాయకులు చాలామంది రైతు కుటుంబాల నుంచి వచ్చిన వారే. వారిని పెంచి పోషించిన పుడమి తల్లిని రైతుల ఇంటిని మర్చిపోతున్నారు. నీ కోరేది రైతులకు ఏదో దోచిపెట్టమని కాదు గిట్టుబాటు ధర కల్పించి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిస్తే అదే చాలు. రైతులు బిచ్చగాడులు కాదు బువ్వ పెట్టేవాళ్ళు. రైతు కన్నీరు పుడమిపై జారకూడదు. భూదేవికి కోపం వస్తుంది. తర్వాత చేయగలిగింది ఏమీ ఉండదు. చల్లపల్లి వీరయ్య చౌదరి కాంగ్రెస్ కళ్యాణదుర్గము

# అల్లూరి సీతారామరాజు త్యాగాలు,ధైర్య సాహసాలు, దేశభక్తి భావం నేటి యువతకు స్ఫూర్తిదాయకం



**ధర్మవరం,జులై04.అక్షర టైమ్స్:-** అల్లూరి సీతారామరాజు త్యాగాలు ధైర్య సాహసాలు దేశభక్తి భావం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని డిప్యూటీ ఎంపీడీవో సురేష్ బాబు తెలిపారు. తాసిల్దార్ ఎస్ దేవరాజు ఆదేశాల మేరకు తాసిల్దార్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.సురేష్ బాబు తో పాటు సిఎస్డిటి ఈశ్వరయ్య, ఇతర అధికారులు, వీఆర్ఏలు, వీఆర్వోలు చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సురేష్ బాబు మాట్లాడుతూ మన్యం వీరుడు, స్వాతంత్య సమరయోధుడు, ఆదివాసాల హక్కుల కోసం పోరాడిన మహా నాయకుడు అల్లూరి సీతారామరాజు అని వారు తెలిపారు. అంతేకాకుండా స్వాతంత్య సమరంలో ఆయన పోషించిన పాత్ర భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. అల్లూరి ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని దేశ అభివృద్ధికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర ఉద్యమ చరిత్రలో అల్లూరి సీతారామరాజు సాగించిన పోరాటం అజరామరమని, తెల్లదొరల గుండెల్లో నిద్రపోయిన విప్లవ వీరుడు అని వారు కొనియాడారు.

# టీచ్ టూల్ కార్యక్రమాన్ని ప్రతి ఉపాధ్యాయుడు విజయవంతంగా కొనసాగించాలి

## ఎంఈఓ లు రాజేశ్వరి,దేవి గోపాల్ నాయక్



**ధర్మవరం,జులై04.అక్షర టైమ్స్:-** టీచ్ టూల్ అనే కార్యక్రమాన్ని ప్రతి ఉపాధ్యాయుడు విజయవంతంగా కొనసాగించాలని ఎంఈఓ లు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో 50 మంది ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ వినయ, ఎంఈఓ లతోపాటు మాస్టర్ ట్రైనర్ రాంప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొని టీచ్ టూల్ యొక్క ప్రాధాన్యతను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచంలో మారుతున్న టెక్నాలజీని అవకాశంగా తీసుకొని ,తరగతి గదిలో బోధన చేయాలని ఉపాధ్యాయుడు యొక్క బోధన సీనియర్ ఉపాధ్యాయులు పరిశీలించి, విద్యార్థికి ఎంతవరకు అర్థమైందో విద్యార్థుల్లో అవుట్ కమ్స్ ఎంతవరకు వస్తుందో అది ముఖ్యమని తెలియజేశారు. ఎంఈఓ విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహపూర్వకంగా ఉండాలని అందరికీ సమానంగా చూడాలని వారి వ్యక్తిగత అభ్యసనం పైన ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలియజేశారు. ఇందులో మూడు రకాలుగా క్లాస్ రూమ్ కల్చర్, లెసన్ ఫెసిలిటేషన్, సోషియో ఎకనామిక్ కల్చర్, బిహేవియర్, మొదలగు అంశాలు ఏ విధంగా తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధిస్తున్నారు? సీనియర్ ఉపాధ్యాయులు అబ్జర్వ్ చేస్తారని , ఉపాధ్యాయులకు బోధనా పద్ధతుల పైన పెంచుకొనుటకు సలహాలు సూచనలు చేయాలని తెలిపారు.

# మేము కూడా టీచర్లమే!



గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో పార్ట్‌టైం టీచర్లది కీలకపాత్ర. మాకున్న సబ్జెక్టు పరిజ్ఞానం, అనుభవం, అంకితభావం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నది. ఈ విషయం మీకు నచ్చినా, నచ్చకపోయినా ఒప్పుకోకతప్పదు. అంతేకాదు, ఎన్నో గిరిజన గురుకులాలు పార్ట్‌టైం టీచర్ల వల్లనే నడుస్తున్నాయన్నది వాస్తవం. అయినప్పటికీ, మేం ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడే అవకాశం కూడా లేకపోతే ఎలా? పోనీ, బయటకి వచ్చి సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తే 'ఇలాంటి ఒక వ్యవస్థ ఉందా?' అని నోరెళ్లబెడుతున్నారు. రెండు దశాబ్దాలుగా స్వయంప్రతిపత్తి కలిగిన గురుకులంలో కనీస జీతం కూడా లేకుండా ఒక ఉపాధ్యాయ వ్యవస్థ నడుస్తున్నదంటే నమ్మశక్యం కాదు. చాలీచాలని జీతంతో సుమారుగా 1,800 మంది ఉపాధ్యాయులు తమ జీవితాలను నెట్టుకొస్తున్నారన్నది కఠోర సత్యం. రెగ్యులర్ టీచర్లతో పోలిస్తే, పార్ట్‌టైం టీచర్ల జీతాలు చాలా తక్కువ. అంతేకాదు, వారితో పోలిస్తే కనీస వసతులు, వనరులు కూడా అందవు. ఇక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయుల జీతం గురించిన ప్రస్తావన తేవడం ఈ రెండు వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తెలియజేసేందుకు మాత్రమే. రెగ్యులర్ ఉపాధ్యాయుల్లాగే క్లాస్‌లు చెప్పటం, నైట్ స్టడీ, హాలిడే డ్యూటీ హౌస్‌మాస్టర్, డిప్యూటీ వార్డెన్ తదితర అన్నిరకాల డ్యూటీలు, పరీక్షల నిర్వహణ, హోమ్‌వర్క్ పరిశీలన, ప్రాజెక్టులకు మార్గనిర్దేశం వంటి పనులు చేస్తున్నప్పటికీ పార్ట్‌టైం టీచర్లకు చాలా తక్కువ జీతం అందుతున్నది. కొన్ని విద్యాసంస్థల్లో మా మిత్రులను కనీసం టీచర్లుగా కూడా గుర్తించరు. ఇది ఎంతటి బాధాకరం. విస్మయం కలిగించే ఇంకో విషయం ఏమిటంటే.. సోదర (మైనారిటీ) సొసైటీలో ఉన్న పార్ట్‌టైం టీచర్ల జీతభత్యాలకు, గిరిజన గురుకులంలో ఇస్తున్న జీతాలకు చాలా తేడా ఉంటుంది. 'ఒకే గురుకులం-ఒకే మెనూ' ఉండాలని ఆలోచించే ప్రభుత్వం.. 'ఒకే గురుకులం-ఒకే వేతనం' అంశాన్ని మాత్రం పెడచెవిన పెట్టడం బాధాకరం. విద్యాసంస్థల నిర్ణయ ప్రక్రియలోనూ పార్ట్‌టైం టీచర్లు తరచుగా పాల్గొనలేరు. రెగ్యులర్ టీచర్లతో సమాన అర్హతలు ఉన్నా, సమాన గౌరవం ఇవ్వకుండా చిన్నచూపు చూస్తారు. అంతేకాదు, సమాజంలో అవహేళనలు, ఛీత్కారాలను తట్టుకొని మరీ గిరిపుత్రుల అభ్యున్నతికి పాటుపడుతున్నవారి శ్రమను గుర్తించకపోగా, కనీస జీతం కూడా ఇవ్వకపోవడం విషాదకరం. ఈ అన్యాయాన్ని సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ వ్యవస్థను గాడిలో పెట్టే బాధ్యత ప్రభుత్వంపైనే ఉన్నది. గురుకులాలన్నీ ఒకే తీరుగా ఉండాలని, ఒకే టైం టేబుల్-ఒకే మెనూ ఉండాలని మాట్లాడే ప్రభుత్వం.. వాటిలో పనిచేసే పార్ట్‌టైం టీచర్లకు ఇచ్చే వేతనాల విషయంలో ఒకే తీరుగా ఉండాలని ఆలోచించకపోవడం బాధాకరం. పార్ట్‌టైం టీచర్లు విద్యావ్యవస్థలో సాధారణంగా కనిపించేవారే కానీ, గుర్తింపు లేని శ్రామికులు. వారి సేవలను గుర్తించడం, వారికి న్యాయం చేయడం, వారి హక్కులను సంరక్షించడం ప్రభుత్వ బాధ్యత. వారికి గౌరవం, ఉద్యోగ భద్రత, సమాన అవకాశాలు కల్పించగలిగితేనే గుణాత్మక విద్య సాధ్యమవుతుంది. కాబట్టి, ప్రభుత్వ పెద్దలు, గిరిజన గురుకులం ఉన్నతాధికారులు ఒక్కసారి మా గురించి ఆలోచించాలి. మా సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తారని కోరుకుంటూ మీకు వినతిపత్రాలు ఇవ్వటం, మీకు మా గోడు వెళ్లబోసుకోవడం తప్ప, ఏమీ చేతగాని, చేవ చచ్చిన అభాగ్య పార్ట్‌టైం టీచర్లుగా పిలవబడే బానిస సమూహం.

# ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత

## విద్యాశాఖ అధికారికి ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్,ఎస్ఎఫ్ఐ వినతి



**రాయదుర్గం,జూలై04.అక్షర టైమ్స్:-** రాయదుర్గం ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు ఫుల్ టీచర్ల ఖాళీలు నిల్ అనికదరంపల్లి పాఠశాలలో 115 మంది విద్యార్థులకు 3 మంది టీచర్లు మాత్రమే - వెంటనే పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ .రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు భారీగా పెరుగుతున్నా, టీచర్ల పోస్టులు మాత్రం ఖాళీగా ఉన్నాయని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాయదుర్గం మండల విద్యాశాఖ అధికారి ఇర్షద్ కి విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షు డు కావలి కోట్రేషఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షు డు తరుణ్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ మాట్లాడుతూరాయదుర్గం మండలం కదరంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2 యూనిట్లకు చెందిన 115 మంది విద్యార్థులు చదువుతున్నారు. కానీ ఈ పాఠశాలలో కేవలం 3 మంది టీచర్లు మాత్రమే ఉన్నారు. టీచర్ల తీవ్ర కొరత వల్ల విద్యాబోధన సరిగా జరగడం లేదు. అదేవిధంగా పాఠశాలలో అదనపు వంట మనిషి లేరు. దానివల్ల రెండు యూనిట్లకు సరఫరా చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వంట మనుషులు,ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ, "ప్రభుత్వం 'విద్యను ప్రధానంగా' అని చెబుతోంది. కానీ గ్రామీణ ప్రాంత పాఠశాలలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. కేవలం ఒక కదరంపల్లి పాఠశాలలోనే ఈ పరిస్థితి ఉంటే, నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఇంకెన్ని సమస్యలు ఉన్నాయో విద్యాశాఖ అధికారులే ఆలోచించాలి" అని అన్నారు. మా డిమాండ్లు:

1. రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న టీచర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి.
2. కదరంపల్లి ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన అదనపు టీచర్లు, వంట మనుషులను టీవీ వెంటనే కేటాయించాలి.
3. నియోజవర్గవ వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత ప్రైమరీ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలి. 4. పాఠశాలల అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి. పై డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నాం అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కుమార్. నాగయ్య.ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు వెంకీ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను ఆరో వేలు చేసి ఆడించిన్రు



తెలంగాణ, ఆంధ్రకు 1956 దాకా ఉన్న ముఖ్యమంత్రులను పక్కకుతోసి అనూహ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రి అయిన నీలం సంజీవరెడ్డి తెలంగాణ పట్ల ఏనాడూ కనికరం చూపలేదు. విలీనపత్రం మీద సంతకం చేసిన సిరా తడి ఆరకముందే ఒప్పందాల ఉల్లంఘనలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి పీఠం అధిరోహించిన సంజీవరెడ్డి తెలంగాణ శాసనసభ్యుల్లో ఒకరిని ఉపముఖ్యమంత్రిగా నియమించాల్సిఉంది. ముందురోజు దాకా తను ఆంధ్ర రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రిగా అధికారాన్ని అనుభవించి కూడా ఆ పదవి పరిపాలనకు ఏమీ అవసరం లేదని, అది ఆరో వేలు లాంటిదంటూ ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించాడు. 1956 నుంచి 1960 దాకా ముఖ్యమంత్రిగా ఉన్న నీలం సంజీవరెడ్డి తన అధికారాన్ని సాగునీరు లేకుండా తెలంగాణను ఎండబెట్టడానికి బాగా ఉపయోగించుకున్నాడు. గోదావరి మీద ఉన్న ఇచ్చంపల్లి, దేవునూరు, పెన్‌గంగ, ప్రాణహిత ప్రాజెక్టులను ఆయన నిలిపివేశాడు. పోచంపాడు పథకాన్ని కుదించి 6 జిల్లాలకు బదులు రెండు జిల్లాలకే సాగునీరు అందేటట్టు డిజైన్ చేశాడు. కుదించిన ప్రాజెక్టు కూడా పూర్తిచేయకుండా తాత్సారం చేశాడు. దాంతో 1959 నుంచి 1969 దాకా ప్రాజెక్టు వ్యయం మూడు రెట్లు పెరిగింది. అంతేకాక కృష్ణా నదీ పరీవాహక ప్రాంత ప్రాజెక్టుల పట్ల కూడా వివక్ష చూపించాడు. విలీనం కంటే ముందే నల్లగొండలో నిర్మించాలనుకున్న ప్రాజెక్టును శంకుస్థాపన చేసిన విజయపురి దగ్గర కాకుండా కిందికి దింపి నందికొండ వద్ద నాగార్జునసాగర్ పేరుతో నిర్మించాడు. ముందు అనుకున్నట్టు ఆ ప్రాజెక్టును ఏలేశ్వరం వద్ద నిర్మించి ఉంటే దశాబ్దాల తరబడి నల్లగొండ వాసులు ఫ్లోరైడ్‌కి బలయ్యేవారు కాదు. సుమారు 10 లక్షల ఎకరాలు నల్లగొండలో సాగయ్యేవి. అంతేకాదు, ఆ నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా కూడా తెలంగాణలో లక్ష ఎకరాల సాగు సంగతి వదిలేసి, ఆంధ్రలో లక్షల ఎకరాలకు ఆయకట్టును స్థిరీకరించారు. ఈ మార్పునకు ఆంధ్ర నాయకులకు శకుని సలహాలు ఇచ్చింది కె.ఎల్.రావు అనే ఇంజినీరు. ఆయన నెహ్రూ క్యాబినెట్‌లో నీటిపారుదల శాఖ మంత్రి. ఈ రకంగా గోదావరి, కృష్ణా ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి, వివక్షకు గురికావడం మూలంగా మహబూబ్‌నగర్ నుంచి వలసల పర్వం మొదలైంది. ఈ అన్యాయాలు వ్యవసాయానికి సాగునీటిలోనే కాక, తాగునీరు, ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ జరిగింది. స్థానికత, ముల్కీ నిబంధనలను ఉల్లంఘించి యథేచ్ఛగా సచివాలయం, ఇతర ప్రభు త్వ ఉద్యోగాల్లో, ముఖ్యంగా ఉన్నత స్థాయి ఉద్యోగాలన్నిటిలోనూ ఆంధ్రులను నింపారు. తెలంగాణ వారి సీనియారిటీనీ లెక్క చెయ్యలేదు. వారితో పాటు అంతకుముందు నుంచీ ఉద్యోగా ల్లో ఉండి, నిజాం ప్రభుత్వంలో మంచి జీతాలు తీసుకున్నవారికి కూడా జీతాలు తగ్గించి, కొత్తగా ఉద్యోగాల్లో చేరిన ఆంధ్రులతో వేతనాలు సమం చేశాడు. వారి నిరసనలన్నీ రోదనలే అయ్యాయి. తెలంగాణ శాసనసభ్యుల ప్రశ్నలు, నిరసనలు అధిక మెజారిటీ ఉన్న ఆంధ్ర, సీమ సభ్యుల అరుపులతో అణచివేయబడ్డాయి. ఏ ప్రాంత ఆదాయం ఆ ప్రాంతానికే వెచ్చించాలనే ఒప్పందమే మర్చిపోయారు ఆంధ్ర నాయకులు. నీలం సంజీవరెడ్డి పాలనలో ఇక్కడి ప్రజలకే కాదు, ఆంధ్ర ప్రజానీకానికి కూడా ఏమీ ఒరగలేదు ఆయన వల్ల. 1950 నుంచీ 1982 దాకా వివిధ స్థాయుల్లో అధికారంలో ఉండి కూడా కనీసం వైజాగ్ స్టీల్ ప్లాంట్ స్థాపనకు వారికి సహాయం చేయలేదు. సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఆంధ్ర ప్రజలు మురిసిపోయి విజయవాడ నుంచి ఏలూరు రోడ్డు వెళ్లే కూడలిలో అభిమానంగా ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 1970లో ఆంధ్ర ఇంజినీర్లు ప్రతిపాదించిన స్టీల్ ప్లాంట్ ప్రారంభానికి నోచుకోలేదు. నీలం సంజీవరెడ్డి 1982లో భారత రాష్ట్రపతి పదవీ బాధ్యతల నుంచి దిగిపోయే ముందు అదే ఏడాది ఫిబ్రవరిలో ఇతరులు ఆ ప్లాంట్‌ను ప్రారంభించారు. సంజీవరెడ్డి సాయం చేయగలిగినప్పటికీ, ఏమీ చేయలేదన్న కోపంతో ఆంధ్ర ప్రజలు ఆయన విగ్రహాన్ని తవ్వి తీసి రైస్ కాలువలో విసిరేశారు. దాదాపు 45 ఏండ్లు అధికారంలో ఉన్నా ఆయన వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదు.

రెండో ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య (1960-1962), మళ్లీ ఒక ఏడాదికి పైగా సంజీవరెడ్డి (1962-1964) ముఖ్యమంత్రులుగా ఉన్నారు. 1964 నుంచి 1971 దాకా కాసు బ్రహ్మానందరెడ్డి, ఆ తర్వాత పి.వి.నరసింహారావు 1971-1973 దాకా అధికారంలో ఉన్నారు. ఆయన తర్వాత జలగం వెంగళరావు 1973-1978 దాకా నాలుగేండ్లు ముఖ్యమంత్రిగా పాలన చేశాడు. తర్వాత మర్రి చెన్నారెడ్డి 1978 నుంచి 1980 దాకా, టంగుటూరి అంజయ్య 1980 నుంచి 1982 దాకా ముఖ్యమంత్రులుగా ఉన్నారు. భవనం వెంకట్రామిరెడ్డి అతి తక్కువ కాలం 1982 ఫిబ్రవరి నుంచి ఆ ఏడాది సెప్టెంబర్ దాకా ఉన్నారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కూడా 1982 సెప్టెంబర్ నుంచి 1983 జనవరి దాకా ముఖ్యమంత్రిగా ఉన్నారు. 1983 జనవరిలో ప్రభంజనం సృష్టించి ముఖ్యమంత్రి అయిన ఎన్టీ రామారావు ఒక్క నెల తప్ప, 1989 సెప్టెంబర్ దాకా తెలుగుదేశం తరపున ఎన్నికై ముఖ్యమంత్రిగా ఉన్నారు. 1989 నుంచీ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో చెన్నారెడ్డి (1989-90), ఎన్.జనార్దన్‌రెడ్డి (1990-92), కోట్ల విజయభాస్కర్‌రెడ్డి (1992-94), మళ్లీ గెలిచిన రామారావు (1994-95), ఆయనను వెన్నుపోటు పొడిచి గద్దె దించిన అల్లుడు నారా చంద్రబాబు నాయడు (1995-2004), వైఎస్ఆర్ (2004-09), రోశయ్య (2009-10), నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి (2010-14) దాకా ముఖ్యమంత్రులుగా ఉన్నారు. ఇక్కడ రెండు ముఖ్యమైన విషయాలను గమనించాలి. ఒకటి, ఉపముఖ్యమంత్రి పదవి తెలంగాణవారికి రాకుండా శ్రద్ధ తీసుకుని, ఉమ్మడి రాష్ట్రానికి రాయలసీమ నాయకులు 27 ఏండ్ల 10 నెలలు, ఆంధ్ర నాయకులు 23 ఏండ్ల 6 నెలలు ముఖ్యమంత్రులుగా పనిచేసి, తెలంగాణను పీల్చి పిప్పి చేశారు. ఇక్కడి చెరువుల్లో పూడిక తీయకుండా తాంబాళాలుగా మార్చి నదీజలాలు యథేచ్ఛగా ఆంధ్ర ప్రాంతానికి తరలించుకుపోయారు. ఉద్యోగాల్లో వేల సంఖ్యలో ఆంధ్ర, రాయలసీమ వారిని నింపి లక్షల మందిని తెలంగాణకు తరలించారు. ఇక మిగులు నిధుల దోపిడీ యథేచ్ఛగా అందరు ఆంధ్ర ముఖ్యమంత్రులూ చేశారు. ఆంధ్ర నుంచి తెలంగాణకి వచ్చి ఉమ్మడి ఏపీకి సీఎంలుగా చేసినవారి ఆస్తుల లెక్కలు 1956 నవంబర్‌లోనూ, 2014 జూన్‌లోనూ పరిశీలిస్తే, దోపిడీ ఎంత జరిగిందో తెలుస్తుంది.ఇక రెండో విషయం, తెలంగాణ నుంచి ముగ్గురు మాత్రమే ముఖ్యమంత్రులయ్యారు. ప్రాంతాలకు సమన్యాయం జరగకుండా వలస పాలకులు చాలా జాగ్రత్తపడ్డారు. చెన్నారెడ్డి రెండువిడతల ముఖ్యమంత్రి కాలాన్ని కూడా కలిపి తెలంగాణకు చెందిన ముగ్గురు కేవలం 6 ఏండ్ల 3 నెలలు ముఖ్యమంత్రులుగా ఉన్నారు, కాదు ఆంధ్ర నాయకులు ఉండనిచ్చారు. ఏదో ఒక గొడవ చేసి ముగ్గురిని వారి టర్మ్‌లో మూడో వంతు కాకుండానే పదవి నుంచి దింపేశారు. భారతదేశాన్నే పూర్తి కాలం అఖండంగా పాలన చేసిన పి.వి.నరసింహారావు కూడా వారి చతురతకు బలయ్యారు. చెన్నారెడ్డిని దింపడానికి వైఎస్ఆర్ కష్టపడ్డాడు. తమ రాయలసీమ రౌడీలను, గూండాలను రప్పించి పాతబస్తీలో వందలాది మందిని ఊచకోత కోయించి, మత కలహాలు సృష్టించి, చెన్నారెడ్డిని గద్దె దింపేట్టు చేశాడు. చిత్రం ఏమిటంటే.. 1950 నుంచీ ఈ ఆంధ్ర నాయకులు తమ బాగు, అధికారం కోసం బతికారే తప్ప, అటు ఆంధ్ర ప్రజలకు గాని, ఇటు ఆక్రమించిన తెలంగాణ ప్రాంతానికి గాని ఏమీ మేలు చేయలేదు. వారు మాత్రం కుబేరులయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ 57 ఏండ్ల 7 నెలల 1 రోజు పాటు ఆంధ్ర పాలకుల వివక్ష, దోపిడీకి గురై, వారి ఆధిపత్య ధోరణిని భరించాల్సి వచ్చింది. వారు చేసిన ద్రోహపు పనులన్నీ చెప్పడానికి ఒక వ్యాసం చాలదు. పెద్ద గ్రంథమే అవుతుంది. మచ్చుకి కొన్ని చూద్దాం.

1. అధికారం: విలీనం జరిగిన వెంటనే ఉపముఖ్యమంత్రి పదవి తెలంగాణకు ఇవ్వకుండా అధికారం మొత్తం తమ చేతిలో ఉండేటట్టు జాగ్రత్తపడ్డారు వలస పాలకులు. మొదటి రోజు నుంచి జరిగిన ఈ వివక్ష, దోపిడీపై శాసనసభలో తెలంగాణ సభ్యులు చాలాసార్లు ప్రశ్నించారు. చొక్కారావు వంటి వారు సాగునీరు, నదీజలాల గురించి అనేకసార్లు ప్రశ్నించారు. కానీ, తెలంగాణ అభివృద్ధి కోసం 105 మంది స్థానిక సభ్యులు అడిగినప్పుడల్లా వారి మాటను 140 మంది పరాయి ప్రాంత వలసవాదులు చెల్లనిచ్చేవారు కాదు. ఈ పశు బలం పోవాలంటే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటమే తప్ప, ఇంకేం పరిష్కారం ఉంటుంది?

2. నీళ్లు: పటేల్, పట్వారీ వ్యవస్థను నిర్మూలించి ఆంధ్ర నాయకులు తెలంగాణకు ఒరగబెట్టిందేమీ లేదు. పల్లెల్లో ఉన్న 45 వేల చెరువుల పట్ల శ్రద్ధ తీసుకునేవారు లేకపోయారు. వీటిని పూడికతీయక తాంబాళాల లాగ తయారు చేసి పై నుంచి నీరంతా ఆంధ్రకే పారించుకున్నారు వలస పాలకులు. అక్కడ ఉద్యోగాలు చేసే ఎంఆర్వో, వీఆర్వోలలో కూడా 90 శాతం ఆంధ్రవారే. అందుకే పల్లె, పట్టణ జీవితం ఛిద్రమైంది. హడావుడి నాటకాలే తప్ప, ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేదు మంత్రులు, ముఖ్యమంత్రులు. నీటిపారుదల శాఖకు తెలంగాణవారు మంత్రులుగా ఉన్నప్పటికీ, నిర్ణయాలన్నీ ముఖ్యమంత్రుల చేతుల్లోనే, హోంమంత్రి తెలంగాణ వాడున్నా టోపీవాడి నెత్తి మీదబీ లాఠీ ముఖ్యమంత్రి చేతుల్లో. ఇక ప్రత్యేక రాష్ట్రం తప్ప ఈ సమస్యకు పరిష్కారమేదీ?

3. నిధులు: 1956 నవంబర్ 2 నుంచి తెలంగాణ నుంచి ఆంధ్రకు నీళ్లే కాదు, నిధులు కూడా యథేచ్ఛగా పారాయి. వీటి లెక్కలు వచ్చే వ్యాసంలో! ఏ ప్రాంత నిధులు ఆ ప్రాంతానికే అన్న నోళ్లే 'మాకాయుష్షు, మాకారోగ్యం, మాకు ధనం, మీకు రణం' అన్నట్టు ప్రవర్తిస్తే.. ప్రత్యేక రాష్ట్రం కాకుండా పరిష్కారమేదీ?

4. నియామకాలు: విలీనమైనప్పుడు ఆంధ్ర నాయకులు ఉద్యోగ నియామకాలకు ఒప్పుకొన్న నిష్పత్తిని ఎప్పుడూ పాటించలేదు. అంతేకాదు, క్లాస్ 1, 2, 3 ఉద్యోగాలలో 98 శాతం ఆంధ్రవాళ్లకి, క్లాస్ 4 ఉద్యోగాలన్నీ తెలంగాణ వారికే! అంత వివక్ష చూపించిన ఆంధ్ర నాయకుల పాపాలు పండి రాష్ట్రం విడిపోయింది. 1956 నవంబర్ 1 నుంచీ 1968 దాకా లెక్కలేనన్ని అన్యాయాలు, అవినీతి, వివక్ష, అక్రమాలు చూసిన తెలంగాణ ప్రజలకు సహనం నశించింది. 1968 నుంచి 1969 దాకా దాదాపు 10 నెలలు అప్రతిహతంగా సాగిన తొలి ఉద్యమం సుదీర్ఘ ప్రజా శాసనోల్లంఘన ఉద్యమంగా చరిత్ర పుటల్లోకి ఎక్కింది. వివరాలు వచ్చే వ్యాసంలో..

# శరీరంలో అధికంగా ఉన్న కొవ్వు కరగాలంటే.. రోజూ వీటిని తీసుకోండి త్వరగా ఫలితం వస్తుంది..!



శరీరంలో అధికంగా కొవ్వు చేరడం అనే సమస్య ప్రస్తుతం చాలా మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. నూనె పదార్థాలు లేదా జంక్ ఫుడ్‌ను అధికంగా తినడం, మద్యం ఎక్కువగా సేవించడం, శారీరక శ్రమ లేకపోవడం, అతిగా తినడం లేదా ఆలస్యంగా తినడం, రాత్రి పూట సరిగ్గా నిద్రించకపోవడం వంటి అనేక కారణాల వల్ల చాలా మందికి శరీరంలో కొవ్వు అధికంగా చేరుతోంది. దీని వల్ల దీర్ఘకాలంలో అధికంగా బరువు పెరగడంతోపాటు టైప్ 2 డయాబెటిస్ వంటి వ్యాధులు కూడా వస్తున్నాయి. అలాగే రక్త నాళాల్లో కొవ్వు అధికంగా చేరి కొలెస్ట్రాల్, గుండె జబ్బులు కూడా వస్తున్నాయి. కనుక శరీరంలో అధికంగా చేరిన కొవ్వును తగ్గించుకోవాల్సిన అవసరం ఏర్పడుతోంది. అయితే కొవ్వును తగ్గించుకునేందుకు రోజూ వ్యాయామం చేయాల్సి ఉంటుంది. అలాగే ఆహారంలో పలు మార్పులు చేసుకుంటే ఈ సమస్య నుంచి సులభంగా బయట పడవచ్చు.

**బీన్స్, ఓట్స్..**

శరీరంలోని కొవ్వును కరిగించడంలో బీన్స్ ఎంతగానో సహాయం చేస్తాయి. రోజూ వీటిని ఒక కప్పు మోతాదులో ఉడకబెట్టి తింటుంటే ఫలితం ఉంటుంది. బీన్స్‌ను తినడం వల్ల జీర్ణవ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది కొవ్వును కరిగించేందుకు సహాయం చేస్తుంది. బీన్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీని వల్ల కూడా కొవ్వును కరిగించుకోవచ్చు. ఫైబర్ వల్ల కేవలం శరీరంలో ఉన్న కొవ్వు మాత్రమే కాకుండా పొట్ట చుట్టూ ఉన్న కొవ్వు సైతం కరిగిపోతుంది. దీంతో సన్నగా నాజూగ్గా మారుతారు. అధిక బరువు సులభంగా తగ్గిపోతారు. రోజూ ఉదయం అల్పాహారంలో భాగంగా ఓట్స్‌ను తింటుండాలి. ఓట్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. కొవ్వు కరిగేలా చేస్తుంది. అలాగే షుగర్ ఉన్నవారికి ఓట్స్ ఎంతో మేలు చేస్తాయి. రోజూ వీటిని తింటుంటే డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది.

**బ్రోకలీ, బ్రౌన్ రైస్..**

శరీరంలోని కొవ్వును కరిగించడంలో బ్రోకలీ కూడా సహాయం చేస్తుంది. ఇందులో విటమిన్లు సి, కె, ఎ, బి6లతోపాటు ఫోలేట్, పొటాషియం తదితర పోషకాలు అధికంగా ఉంటాయి. రోజూ బ్రోకలీని ఒక కప్పు మోతాదులో ఉడకబెట్టి తింటున్నా ఫలితం ఉంటుంది. శరీరంలోని కొవ్వు త్వరగా కరిగిపోతుంది. అలాగే కొవ్వు కరిగి ఆరోగ్యంగా ఉండాలంటే బ్రౌన్ రైస్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇందులో ఉండే ఫైబర్ ఆకలిని నియంత్రిస్తుంది. ఆహారం తక్కువ తినేలా చేస్తుంది. మెటబాలిజంను పెంచుతుంది. దీంతో శరీరంలోని కొవ్వు కరుగుతుంది. రోజూ బ్రౌన్ రైస్‌ను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

**బాదంపప్పు, గ్రీన్ టీ..**

కొవ్వు కరిగేందుకు గాను పియర్స్ పండ్లు కూడా ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని కొవ్వు నిల్వలపై ప్రభావం చూపిస్తాయి. దీని వల్ల శరీరంలో కొవ్వు చేరదు. బరువు తగ్గుతారు. అలాగే ఈ పండ్లను తింటే రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు.